క్లుప్తంగా

పూలే యువజన సంఘం అధ్యక్షుడిగా వికాస్



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామ పూలే యువజన సంఘం అధ్యక్షుడిగా పిట్టల వికాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు చెల్పూరి శ్రీకాంత్, గౌరవ సలహాదారులు నాగుల పవన్‌కల్యాణ్, బాబు రజనీకాంత్ తెలిపారు. కార్యదర్శిగా పల్లె బోయిన అఖిల్, ఉపాధ్యక్షులుగా మహ్మద్ రిజ్వాన్, క్రీడా విభాగం కార్యదర్శిగా బిల్లా వెంకటేష్, గిరిబోయిన ప్రశాంత్, సాంస్కృతిక కార్యదర్శిగా కుక్కల దేవేందర్, సహాయ కార్యదర్శిగా తడక బద్రి, కమిటీ సభ్యులుగా సాయి, మనోజ్, బాలరాజు, నవీన్, నితిన్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

బాధితులకు పరామర్శ



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కండె చక్రపాణి తండ్రి కండె రాజయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతునిపట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవీందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మండల సురేందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చల్లా ధర్మారెడ్డి పరామర్శలు..

దామెర : మండలంలోని ఊరుగొండకు చెందిన మన్నెం బుచ్చిరెడ్డి మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుచ్చిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అదే విధంగా మండలంలోని దుర్గంపేట్‌కు చెందిన చిల్లా తిరుపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము, వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ, మాజీ సర్పంచ్ గోగుల సత్యనారాయణ రెడ్డి, నాయకులు గోగుల వీరారెడ్డి, కూనాటి సునీల్‌రెడ్డి, గండు సదర్శన్ తదితరులు ఉన్నారు.

ఆత్మకూరులో..



ఆత్మకూరు : కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు పాపని రవీందర్ తల్లి పాపని లలిత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా బాధిత కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్ రెడ్డి, నాయకులు గండు రాము, సదానందం, భాషబోయిన పైడి, తదితరులు ఉన్నారు.

నడికూడలో..

నడికూడ : మండలంలోని రాయపర్తి గ్రామానికి చెందిన చలుమల్ల సాంబరెడ్డి సోమవారం కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సాంబరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

ఎంపీపీ పరామర్శ

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు పాడిశెట్టి గణేశ్ తల్లి రాజేశ్వరి అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు రాజేందర్, నందం, తదితరులు ఉన్నారు.

ఎంసెట్ ర్యాంకర్‌కు అభినందన



వేలేరు : ఇటీవల విడుదలైన ఎంసెట్ ఫలితాల్లో మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన మనిలేష్‌రెడ్డి ఉత్తమ ర్యాంక్ సాధించడంతో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మంగళవారం అభినందిచారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థికి సూచించారు. కాగా గతంలో కడియం ఫౌండేషన్ ద్వారా మనిలేష్‌రెడ్డికి ఆమె ఆర్థిక సాయం అందించారు.

వామ్మో కొండపర్తి దారి..

- నిలిచిన బీటీ నిర్మాణ పనులు
- కంకరపోసి వదిలేసిన కాంట్రాక్టర్లు
- పగులుతున్న వాహనాల టైర్లు
- ఆగ్రహిస్తున్న ప్రయాణికులు



మధ్యలోనే నిలిచిపోయిన ఐనవోలు- కొండపర్తి రోడ్డు నిర్మాణ పనులు

ఐనవోలు : వరంగల్, హనుమకొండ జిల్లా కేంద్రాలకు వేర్వేరు మార్గాల్లో వెళ్లాలంటే పట్టుమని పది కిలోమీటర్ల దూరంలో ఉన్నామని సంతోషించాలో.. లేక నరకలోకానికి వెళ్లే దారుల వెంట ప్రయాణించి ప్రాణాల మీదకి తెచ్చుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది మండలంలోని కొండపర్తి గ్రామస్తులకు. సిటీ దగ్గరగా ఉండటంతో తమ అవసరాల కోసం నిత్యం వందలాది మంది గ్రామస్తులు వరంగల్, హనుమకొండతోపాటు మండల కేంద్రానికి వెళ్లి వస్తుంటారు. ఈ మూడు మార్గాల్లో ప్రయాణం నరకయాతన కలిగిస్తుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. హనుమకొండ వెళ్లేవారు భట్టుపల్లి, కాజీపేట దర్గా మీదుగా వెళ్తుండగా, వరంగల్‌కు వెళ్లే వారు వయా తిమ్మాపూర్ మీదుగా వెళ్తుంటారు. మండల కేంద్రానికి వెళ్లే వారు ముల్కలగూడెం, ఒంటిమామిడిపల్లి గ్రామాల మీదుగా వెళ్తుంటారు. ఈ మూడు దారుల్లో పీఆర్, ఆర్‌అండ్‌బీ, కుడా నిధులతో బీటీ రోడ్డు పనులను 8 నెలలుగా ప్రారంభమయ్యి ప్రస్తుతం వివిధ దశల్లో నలిచిపోయాయి. దీంతో ఆ దారుల వెంట ప్రయాణించే గ్రామస్తులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎన్నికల కోడ్‌ను అడ్డు పెట్టుకుని మూడు చోట్ల కాంట్రాక్టర్‌లు పనులను జాప్యం చేశారని గ్రామస్తులు



దుమ్ములేస్తున్న కాజీపేట దర్గాకు వెళ్లే రహదారి

ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే ఎన్నికలు పూర్తి అయిన వెంటనే సర్పంచ్‌ల పదవీకాలం పూర్తికావడంతో అసలు కాంట్రాక్టర్లను అడిగే నాథుడే లేడని అంటున్నారు. స్థానిక నాయకులు సదరు కాంట్రాక్టర్లను కలిసి పనులు పూర్తిచేయాలని వేడుకున్నా వారు సాకులు చెబుతూ సాగదిస్తున్నారనే ఆరోపణలు



మలుపు వద్ద గుంతలు పడి కంకరతేలిన రోడ్డు

వ్యక్తం అవుతున్నాయి. నత్తనడకన సాగుతున్న పనులు పూర్తిచేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎవరు పట్టించుకోకపోతే త్వరలో సంబంధిత శాఖల అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు స్థానికులు, వాహనదారులు హెచ్చరిస్తున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



కొండపర్తి నుంచి సింగారం మీదుగా వరంగల్‌కు వెళ్లే దారిలో బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. మలుపుల వద్ద రోడ్డు సరిగా లేకపోవడంతో గతంలో ప్రమాదాలు జరిగాయి. ముఖ్యంగా రాత్రిపూట ప్రయాణం ఇబ్బందిగా మారుతోంది. పలువురు ప్రమాదాల్లో గాయపడినా ఎవరు పట్టించుకోవడం లేదు. హెవీ వెహికిల్స్ ఈ మార్గంగుండా నిత్యం నడుస్తుండటంతో రోడ్డు తరచూ దెబ్బతింటుంది. అధికారులు చర్య తీసుకోవాలి.

- వస్కుల ప్రశాంత్, కొండపర్తి

నరకయాతన అనుభవిస్తున్నాం



ఎనిమిది నెలలుగా రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. మా సోదరి గర్భవతి, అలాగే మా నాన్న కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో తరచూ జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసంపూర్తిగా రోడ్డు పనులు ఉండడంతో ఆటోలో వెలితే గుంతల వలన ఇబ్బందులు పడటమే కాకుండా మొత్తం కంకర తేలి ఉండటంతో దుమ్ము లేస్తుంది. అధికారులు స్పందించి రోడ్డు త్వరగా పూర్తిచేయాలి.

- కట్కూరి శ్రవణ్ కుమార్, కొండపర్తి

టైర్లు పగిలిపోతున్నాయి



వడ్లు, ఇటుక, సిమెంట్ బస్తాల లోడ్‌కు కిరాయిలకి వెలుతుంటా. కిరాయిలకు పోకపోతే ఇళ్ల గడవదు.. అట్లని ఈ రోడ్డుపై పోతే రెండు టైర్లు పగిలిపోయినవి. మా బాధలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదు. పేదలను పట్టించుకునే వారు కరువయ్యారు. రాత్రిపూట ద్విచక్రవాహనదారులు నిత్యం స్కిడ్ అయి పడిపోతున్నరు. వానాకాలంలో ఇంకా తీవ్ర ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి. అధికారులు పట్టించుకొని పనులు త్వరగా పూర్తిచేయాలి కోరుకుంటున్నాను.

- కట్కూరి ప్రసాద్, వాహన దారుడు

వీరభద్రుడి భూములకు రక్షణ కరువు

- బీజేపీ మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్

ఎల్కతుర్తి : కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ భూములకు రక్షణ కరువైందని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ భూములను ఆయన పరిశీలించి మట్లాడారు. కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయానికి 22 ఎకరాల 39గుంటల భూమి ఉందన్నారు. దేవుడి భూములు సర్వే చేపట్టకపోవడంతో కాలక్రమేనా భూములు తగ్గుతూ వస్తున్నాయని ఆరోపించారు. 2019లో దేవాదాయ శాఖ అధికారులు తూతూమంత్రంగా సర్వే చేపట్టారని, హద్దులు నిర్ణయించలేదని ఆరోపించారు. దీంతో ఆ భూములపై అక్రమార్కులు కన్నేసి అందినకాడికి కబ్జా చేస్తున్నారని అన్నారు. ఆలయ చైర్మన్ పదవీకాలం పూర్తయిన మూడు రోజులకే స్థానికంగా ఉండే ప్రయివేటు పాఠశాల యాజమాన్యం ఆలయానికి చెందిన భూమిలో ప్రహరీ నిర్మాణం చేపట్టి హడావిడిగా పూర్తి చేయడం వెనక ఆంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ తతంగం దేవాదాయ శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆలయానికి సంబంధించిన భూములను గుర్తించేందుకు సర్వే చేసి హద్దులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సంపత్, శ్రీనివాస్, సదానందం, రాజు, శ్రీనివాస్, అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఘనంగా కాలసర్ప పూజలు



ప్రత్యేకాలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో తపోభూమిగా, నవనాగ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన ఆలయంలో మంగళవారం పంచమి ఆశ్లేష నక్షత్రం విశేష పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రహ దోషాలకి, సర్పదోషాలకి ప్రత్యేక పరిహారంగా ఆశ్లేష బలి కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రహ దోషాలకు వంశపార్యపరంగా ఏర్పడే సర్పదోషాలకు పరిహారంగా ప్రతినెల ఆశ్లేషబలి, ప్రతి అమావాస్యకు చండీహోమం, ప్రతి మంగళవారం నవనాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి విశేష అభిషేకం జరిపించనున్నట్లు తెలిపారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటే వివిధ రాకాల కాలసర్ప దోషాలు తొలిగిపోతాయని, ఆలయ ట్రస్ట్ చైర్మన్ గంట పవన్ శర్మ తెలిపారు. ఆలయంలో జరుగు కార్యక్రమాల వివరాలు తెలుసుకునేందుకు 9908998839 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. భక్తులు పోటెత్తడంతో ఆలయం కిక్కిరిసింది.

హోటళ్లలో పరిశుభ్రత పాటించాలి



హోటల్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

పరకాల : వర్షకాలం దృష్ట్యా పట్టణంలోని హోటళ్ల యజమానులు వంట గదుల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ పెద్ది వెంకటనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని కామారెడ్డిపల్లి శివారులోని హోటళ్లను తనిఖీ చేశారు. ఒకసారి వినియోగించిన నూనెను మళ్లీ ఉపయోగించడం, కాలం ముగిసిన పదార్థాలను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటల్‌కు వచ్చే వారికి నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. వర్షాకాలంలో ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతాయని అన్నారు. వేడి ఆహారమే అందించాలని, ఆహారంపై ఏదైనా కప్పి ఉంచాలని అన్నారు. అన్ని నిబంధనలు పాటించాలని సూచించారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, పంచాయతీ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్యాబోధన

రాయపర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్యాబోధన లభిస్తుందని మండలంలోని తిర్మలాయపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గోరంట్ల శ్రీమన్నారాయణ తెలిపారు. ఆ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీమన్నారాయణ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారని చెప్పారు. అలాగే ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు శారద, రవికుమార్, మల్లేశం, వసంత, అపర్ణ శాలిని, శ్రీలత, సోమయ్య పాల్గొన్నారు.

కాల్వ ఏర్పాటు చేసి రోడ్డు నిర్మించండి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముగ్దుంపురం గ్రామ ఊర చెరువు నెక్కొండ వంపు కాల్వను పునర్నిర్మించడంతోపాటు వట్టె వాగు వరకు రోడ్డు నిర్మించాలని కోరుతూ ఆయకట్టు రైతులు తహసీల్దార్ కార్యాలయ అధికారికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు సమస్యలను ఏకరువు పెట్టారు. ముగ్దుంపురం గ్రామ ఊర చెరువు, పరిసర ప్రాంతాల రైతులు పొలాలకు వెళ్లాలంటే దారి లేకపోవడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. కాల్వ లేక నీరు పారకం ఇబ్బందిగా ఉందన్నారు. కాల్వ ఏర్పాటు చేసి పక్కనే దారి ఏర్పాటు చేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు శ్రీనివాస్‌రెడ్డి, మధు, జంపయ్య, నర్సు, వాల్య, చల్లా మల్లారెడ్డి, నాంపెల్లి వెంకన్న, సమ్మక్క, వెంకన్న, ఉమ ఉన్నారు.

జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

పర్వతగిరి : మండలంలోని గోపనపల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు బి.స్నేహ, ఎ.రక్షిత, ఎ.శ్రీజ, పి.అక్షిత, కె.ఆకాశ్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ కళాశాలలో సీటు పొందారు. ఈ సందర్భంగా వారిని ప్రధానోపాధ్యాయుడు లింగమూర్తి, మండల నోడల్ అధికారి లింగారెడ్డి, ఉపాధ్యాయులు మహ్మద్ అబ్దుల్ గఫార్, నాగసం శ్రీనివాస్, వి.సదానందం, వి.వాసవి, ఎల్.శ్రీధర్, మహ్మద్ ఫరీద్, పురుషోత్తంరావు, నాగేశ్వరాచారి బుధవారం అభినందించారు. అనంతరం నోడల్ అధికారి లింగారెడ్డి మాట్లాడారు. స్కూల్‌లో పదో తరగతి చదివిన విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో సీటు సాధించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు చదువుతో రాణించాలని కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అమీన్‌పేటలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను రంజిత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు రోడ్డు సమస్య ఎదుర్కొంటుండగా ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నుంచి రూ.4 లక్షలు కేటాయించడంతో పనులు చేపట్టామని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలనూ పరిష్కరించడానికి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, మాజీ సర్పంచ్ గరికపాటి హన్మంతరావు, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, నాయకులు కుసుమ చెన్నకేశవులు, రావుల మహిపాల్‌రెడ్డి, సుధాకర్, జానీ పాషా, యాకూబ్‌పాషా, గరికపాటి కోటేశ్వర్‌రావు, వెంకట కోటయ్య, చిలుపూరి యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు సన్మానం

నర్సంపేట : ఉత్తమ ఫలితాలు సాధించిన నర్సంపేట ఆర్టీసీ డిపో ఉద్యోగుల పిల్లలను డిపో ఆవరణలో డిపో మేనేజర్ (డీఎం) ప్రసూనలక్ష్మి మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడారు. ఆర్టీసీ డ్రైవర్ కిషన్ కుమారుడు మహేశ్ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఆలిండియా స్థాయిలో 395వ ర్యాంకు, కండక్టర్ జానీ పాషా కుమారుడు అష్రఫ్ పాషా స్పోర్ట్స్ విభాగంలో, మహిళా కండక్టర్ సునీత కుమారుడు అరుణ్‌తేజ జూనియర్ ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించినట్టు తెలిపారు. సదరు విద్యార్థులను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించి పలు సూచనలు చేశారు.

గోపాల మిత్రల గోస..

- ఐదు నెలల నుంచి అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి



కృత్రిమగర్భదారణతో జన్మించిన దూడతో గోపాల మిత్ర, పాడి రైతు

పరకాల : కోడికూతతో నిద్రలేచిందే ఆలస్యం రైతు పిలుపు అందగానే వారు అక్కడ వాలాల్సిందే. రైతులకు సహాయంగా ఉంటూ పశువుల కృత్రిమ గర్భదారణ కోసం నిరంతరం శ్రమించే గోపాల మిత్రులు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. తమ సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని దిగాలు చెందుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అనుబంధంగా ఉన్న పశుగణాభివృద్ధి సంస్థలో 23 ఏళ్లుగా 1,350 మంది గోపాల మిత్రులు పశువుల కృత్రిమగర్భదారణ సేవలు అందిస్తున్నారు. వారిలో ఒక్క వరంగల్ ఉమ్మడి జిల్లాలోనే 180 మందికి పైగా అంటే 6 నుంచి 8 గ్రామాలకు ఒక్కరుగా సేవలందిస్తున్నారు. అయినా ప్రభుత్వం నుంచి తగిన పారితోషికం అందకపోవడంతో ఆర్థిక సమస్యలతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని మొరపెట్టుకుంటున్నారు. వాస్తవానికి పశువుల కృత్రిమ గర్భదారణ కోసం వీర్య ప్రవేశం పెట్టేందుకు ప్రతి ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 18 లక్షల డోసులు లక్ష్యంగా ఒక్కో డోసుకు రూ.40 చొప్పున ముందుగా గోపాలమిత్రలు చెల్లిస్తారు. కృత్రిమ గర్భదారణ కావాల్సిన పశువులకు డోసు ఇచ్చి సదరు రైతు నుంచి ఆ మొత్తాన్ని స్వీకరిస్తారు. దింతో ప్రభుత్వానికి రూ.7 నుంచి రూ.8కోట్ల ఆదాయం సమకూరుతుంది. అయితే వీటిపైనే గోపాల మిత్రుల గౌరవ వేతనం ఆధారపడి ఉంటుంది. లక్ష్యం నెరవేరకపోతే గౌరవ వేతనంలో కోత ఉంటుంది. వాస్తవానికి కృత్రిమ గర్భదారణ గోపాల మిత్రుల ముఖ్యకర్తవ్యం అయినప్పటికీ పశుసంవర్ధక శాఖ నిర్వహించే పశుగర్భకోశ చికిత్స వైద్య శిబిరాలు, జీవాలలో నట్టల నివారణ, పశుగ్రాసాల పెంపకం, దూడల పోషణ, రైతు అవగాహన సదస్సు నిర్వహణలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. కృత్రిమ గర్భదారణ వలన మేలు జాతి దూడలు జన్మించడం, వాటి విలువ రూ. 50వేల నుంచి రూ.70వేల వరకు ఉంటుంది. పాడి రైతులకు గోపాల మిత్రులు అండగా నిలుస్తున్నారు. అందుకు సమాన పనికి సమాన వేతనం కావాలంటూ గత ప్రభుత్వాలకు పలుమార్లు గోపాల మిత్రులు విన్నవించుకోగా కేవలం రూ.8,500లకు పెంచడం అందిస్తోంది. అయితే 5 నెలలుగా వేతనం అందించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని వాపోతున్నారు. కొంతమంది గోపాల మిత్రులు మానసిక వేదనతో గుండెపోటుకు గురై మృతిచెందారని అంటున్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం గోపాల మిత్రల సేవలను గుర్తించి న్యాయం చేయాలని కోరుతున్నారు. పశుగణాభివృద్ధిలో తమ సేవలను గుర్తించాలని గోపాలమిత్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

శాశ్వత ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలి



పశుగణాభివృద్ధిలో గోపాల మిత్రులుగా తాము అందిస్తున్న సేవలను మానవీయకోణంలో పరిగణలోకి తీసుకోవాలి. పే స్కేల్‌తో పాటు శాశ్వత ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలి. పగలు, రాత్రులు తేడా లేకుండా ద్విచక్రవాహనాలతో గ్రామాలకు వెలుతున్నందున తరచు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రమాదబీమా కల్పించించాలి.

- పెండ్యాల కుమారస్వామి, గోపాలమిత్ర

ఇంటింటా మిషన్ భగీరథ సర్వే

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంపై ఇంటింటికీ మంగళవారం సర్వే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, తదితరులు గ్రామంలోని ప్రతీఇంటికి వెళ్లి నల్లా ఉందా? లేదా? ఉంటే సరిపడా నీరు వస్తుందా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నల్లా, సంపుతోపాటు కుటుంబ యజమానిని ఫోటో తీస్తూ అప్‌లోడ్ చేశారు. సర్వేను ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ శ్రీధర్ గౌడ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

పోస్టులు ఖాళీ.. 'గృహజ్యోతి'కి ఇబ్బందులు



ఎంపీడీఓ కార్యాలయం

ఖానాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండడంతో అర్హులకు గృహజ్యోతి వివరాల సవరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండల పరిషత్ కార్యాలయానికి గృహజ్యోతి వర్తింపు కోసం ప్రతీరోజు సుమారు 100 మందికిపైగా వస్తున్నారు. కాగా జూనియర్ అసిస్టెంట్ ఇటీవల సెలవుపై వెళ్లగా కంప్యూటర్ ఆపరేటర్‌ను జెడ్పీకి సరెండర్ చేశారు. ప్రస్తుతం ఈ రెండు పోస్టులు ఖాళీగా ఉండటంతో సీనియర్ అసిస్టెంట్, సూపరిండెంట్ సవరణ చేయాల్సి వస్తోంది. వారు ఆ విధుల్లో ఇతర పనులు కావడం లేదు. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను భర్తీ చేసి గృహజ్యోతి పథకం వర్తింపులో అర్హులకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికుల ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీఆర్‌నగర్ గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

నర్సంపేట : పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ పరిధిలోని సర్వే నంబర్ 111లోని ప్రభుత్వ భూమిలోని గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని డీబీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గణిపాక అశోక్ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలందరికీ వెంటనే పట్టాలివ్వాలని, కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాపర్తి జగన్నాథం, కందకట్ల సురేష్, అల్లం రాజక్క, గండికోట సమ్మక్క, జన్ను మానస, చామంతుల మౌనిక, చింత సంపత్, కుక్కమూడి నాగరాజు, మాడిశెట్టి శివకృష్ణ, రామగిరి కనకయ్య, కదిరి వెంకన్న, రాపోలు వెంకన్న, గుడిసె వాసులు, తదితరులు పాల్గొన్నారు.